క్లుప్తంగా

సరమ్మ సన్నిధిలో ఎంపీ శ్రీధర్


సరమ్మను దర్శించుకుంటున్న ఎంపీ శ్రీధర్

లింగపాలెం : లింగపాలెంలో శ్రీసరమ్మ తల్లి పేరంటాళ్ల మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయన, పార్టీ నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సరమ్మ తల్లికి ఎంపీ శ్రీధర్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన ఎంపీ వెంట జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొఠారి మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.

సరమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

లింగపాలెంలో సరమ్మ పేరంటాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి బుధవారం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మద్ది ఆలయ కమిటీ చైర్మన్ కీసరి సరితా విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈవో కొండలరావు, డైరెక్టర్ చిలుకూరి సత్యన్నారాయణరెడ్డి సరమ్మకు పట్టువస్త్రాలు, పండ్లు, పువ్వులు, గాజులు, తమలపాకులు సమర్పించారు. ఏటా అమ్మవారికి మద్ది ఆలయం తరుపున పట్టువస్త్రాలు సమర్పిస్తామని ఈవో కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, సొసైటీ చైర్‌పర్సన్ బి.సోమిరెడ్డి, ఎంపీటీసీ భీమిరెడ్డి స్వరూప, బి.ప్రభాకరెడ్డి, సరమ్మ అలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించిన బాలరాజు


కనకదుర్గమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మ, అన్నపూర్ణ, విశ్వేశ్వరస్వామి ఉత్సవాలు రెండో రోజు కావడంతో గిరిజన ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలవచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుండె సంబంధిత చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు జాతరకు విచ్చేశారు. కనకదుర్గమ్మ తల్లికి బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సాయి విశాల్, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లూరి రత్నాజీరావు, ధర్మకర్తలు భౌమరాజు సత్యనారాయణరాజు, భౌమరాజు ధనుంజయ రాజు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, గ్రామస్తులు యాండ్ర రవి, కణితి దుర్గారావు ఎమ్మెల్యే బాలరాజుకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలను జరిపించారు. ఎస్సై ఎం.జయబాబు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సినీ మ్యూజికల్‌నైట్ నిర్వహించారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా రాయి కస్తూరి


ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డును తీసుకుంటున్న రాయి కస్తూరి

కుక్కునూరు : మండలంలోని గోపరాజుగూడేనికి చెందిన రాయి కస్తూరి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఏపీ మహిళా ఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత


మృతుడు వెంకన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

కామవరపుకోట : ఇటీవల దేవులపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల వెంకన్న కుటుంబానికి బుధవారం సోషల్ వర్కర్స్ టీం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. దాతల నుంచి సేకరించిన రూ.23 వేలు నగదు, 50 కేజీల బియ్యం వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సోషల్ వర్కర్ వీరమల్ల మధు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కడిపి పాపారావు, మున్నంగి శ్రీనివాస్, వీరమల్ల సాజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


జంగారెడ్డిగూడెంలో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి ఉన్నమట్ల రూన్సీరాణి


జంగారెడ్డిగూడెం కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి

జంగారెడ్డిగూడెం : మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సతీమణి రూన్సీరాణి అన్నారు. జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా చైతన్యం, ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారని, ఆయన అందిస్తున్న చేయూతను ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తినలక్ష్మి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, చింతలపూడి జెడ్పీటీసీ నీరజ, రమ, స్వాతి, సునీత, జ్యోతిక, సత్య, ఎం.జ్యోతి, రాధిక, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికారి సంస్థ ఛైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కోర్టుకు వచ్చే ప్రతి మహిళ బాధను అర్థం చేసుకుని న్యాయం జరిగేలా ప్రతి న్యాయవాది చూడాలని సూచించారు. జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.రాజరాజేశ్వరీ తేజస్వి మాట్లాడుతూ ప్రతి మహిళ విజయం సాధించాలంటే వారికి స్వేచ్ఛా హక్కును, మాట్లాడే హక్కును కల్పించాలని, అప్పుడు వారు ఉన్నతిని సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో బార్ సభ్యులు పాల్గొన్నారు. జమఅతే ఇస్లామి హింద్ -మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ కంచర్ల వాసవీ రత్నం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు.

సాయిబాలపద్మకు సత్కారం

జంగారెడ్డిగూడెం నుంచి ఆర్యవైశ్య మహిళగా ఉన్నతమైన స్థితికి చేరుకున్న మహిళా నేతగా వందనపు సాయిబాలపద్మ ఆదర్శంగా నిలిచారని ఉప్పలమెట్ట వాసవీక్లబ్ కపుల్స్ సభ్యులు అన్నారు. స్థానిక ఉప్పలమెట్ట వాసవీక్లబ్ సభ్యులు మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయి బాలపద్మను సత్కరించారు. స్థానిక 4 వార్డు ఇందిరానగర్ కాలనీలో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు బేబి రత్నం ఆరుగురు గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : మహిళా సాధికారిక అభివృద్ధిలో దేశానికి ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా నిలిచింది అని పశ్చిమ డెల్టా బోర్డు చైర్‌పర్సన్, పోలవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మహిళా ఇన్‌చార్జి గంజిమాల దేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఆమె నివాసంలో నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, గుబ్బాలు, ఘంటసాల సీనమ్మ, చింత శ్రీదేవి, నారా అన్నపూర్ణ, చిక్కాల మంగతాయారు, మందపాటి కుమారి, మిరియాల విజయ, సున్నం శాంతకుమారి, ఉప్పల పద్మావతి పాల్గొన్నారు. ఇందిరా క్రాంతి పదం ఆధ్వర్యాన పరింపూడిలో డ్వాక్రా గ్రూప్ మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు.

కుక్కునూరులో...

కుక్కునూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన సెంటర్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వర్మా శ్యామల అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమైఖ్య కేంద్ర నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు కారకులైన దోషులను రక్షించే చర్యలు ఎక్కువయ్యాయని విమర్శించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం

లింగపాలెం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ధర్మాజీగూడెంలో స్థానిక వాసవీ, వనీత క్లబ్‌ల ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. వాసవీ, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతిలో మహిళ పాత్ర కీలకం

టి.నరసాపురం : సమాజ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమైనదని మాజీ ఎంపీపీ కొత్త సురేఖ అన్నారు. బొర్రంపాలెంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడం ద్వారానే అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. బ్యాంకు మేనేజర్ వినయ్‌కుమార్, సిబ్బంది రవికిరణ్, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయు ఆధ్వర్యంలో ఐద్వా నాయకురాలు ఎం వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. సమాజంలో మహిళల పై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులను ఖండించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన మహిళలను సత్కరించారు. స్థానిక బోయగూడెం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం చర్చ్ కౌన్సిల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం స్త్రీల అధ్యక్షురాలు దాసరి జాషువ కుమారి, సీహెచ్ షాలిని, కోశాధికారి జి విజయలక్ష్మి, ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్ రాణి పెర్సి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్యారిస్ గురువులు పీజే వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఘనంగా మహిళా దినోత్సవం

బుట్టాయగూడెం : ఏజెన్సీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. బుట్టాయగూడెంలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ అభిషేక్, ఏపీడీ నాగేశ్వరరావు, ఏపీఎం పద్మావతిలను మహిళా సంఘాల వారు ఘనంగా సన్మానించారు. అనంతరం మ్యూజికల్ చైర్స్, తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేశారు. మండలంలో ఉత్తమ సేవలు అందజేసిన మండల సమైఖ్య, సీసీలు, సీఏలకు మొమెంటోలను అందజేశారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళలు బుట్టాయగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జీలుగుమిల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పశువర్ధక శాఖ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

పోలవరం రూరల్ : మండలంలోని గుంజవరం, చేగొండిపల్లి, సింగన్నపల్లి, మామిడిగొంది, రేపల్లెవాడ, ప్రగడపల్లి గ్రామాల్లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు చైతన్యవంతులు కావాలని, స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగాలని మహిళలు నినదిస్తూ ర్యాలీలు చేశారు. ఎల్ఎన్‌డీపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలు మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. మహిళల సమస్యలపై పోరాడి విజయం సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో మానవతా సేవా సంస్థ కమ్యూనిటీ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మానవతా సంస్థ ఉపాధ్యక్షురాలు త్రిపురకి సన్మానం చేశారు.

హోం మంత్రి వనితకు శుభాకాంక్షలు


హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో మాట్లాడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : కామవరపుకోటలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరయ్యేందుకు వెళుతున్న హోం మంత్రి తానేటి వనిత జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు వనితకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై కొద్దిసేపు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో చర్చించారు. ఎన్నికల పరిస్థితులు, నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమని ఉన్నమట్ల రూన్సీరాణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు సాయిబాల పద్మ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పట్టణ, మండల అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, మండలపు సాయిబాబు, బత్తిన చిన్న తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న గంజిమాల దేవి


కుక్కునూరులో మాట్లాడుతున్న అక్కినేని వనజ


ధర్మాజీగూడెంలో మహిళలను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు


జీలుగుమిల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సంక్షేమ లబ్ధికి అర్హతే ప్రామాణికం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల సచివాలయ కన్వీనర్ ఆవుల బాలక్రిష్టారెడ్డి

కుక్కునూరు : టీడీపీ అధికారంలో ఉండగా జన్మభూమి కమిటీలు చెప్పినవారికే సంక్షేమ పథకాలు అందితే, పార్టీ తారతమ్యాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. బుధవారం కుక్కునూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుచ్చర్లపాటి నరసింహరాజు, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు ఆవుల క్రిష్టారెడ్డి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో రైతు రుణమాఫీ సొమ్మును మండలానికి చెందిన రైతుల పేరుతో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన టీడీపీ కార్యకర్తల ఖాతాలలోకి తరలించి ప్రజల సొమ్మును కార్యకర్తలకు దోచిపెట్టారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కుల, మత, రాజకీయ భేదం లేకుండా అర్హులకు సంక్షేమ లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్నారని వివరించారు. దీంతో ఓర్వలేని ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పథకాలు అందడంలో ఏమైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించే దిశగా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు రావు వినోద్, కె కృష్ణంరాజు, బట్టు వీరబాబు, రాయి సత్యనారాయణ, చిన్న నరసింహరాజు, పోలగాని వెంకట్రావు, నకిరికంటి నరసింహారావు, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, మల్లెల చంటి నాయుడు, రాయి రవి, సూర్ల రాము, పగిళ్ల అల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం . మండలంలోని పంగిడిగూడెంకు చెందిన తైదుల రమ్య అదే గ్రామానికి చెందిన అబ్బదాసరి నాగు వద్ద ఐదేళ్ల క్రితం కొంత నగదును అప్పుగా తీసుకుంది. అయితే రూ. 60 వేలు తిరిగి చెల్లించగా, ఇంకా రూ. 5 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో నగదు కోసం బుధవారం రమ్య ఇంటికి వెళ్లిన నాగు ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, తిట్టినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు


కొయ్యలగూడెంలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న రాజస్థానీయులు


టి.నరసాపురంలో హోలి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో బుధవారం హోలీ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. రాజస్థాన్ నుంచి వ్యాపార రీత్యా కొయ్యలగూడెం వచ్చి స్థిరపడి వివిధ వ్యాపారాలు నిర్వహించుకుంటున్న కుటుంబాల వారు సామూహికంగా ఒక చోటకు చేరి హోలీ వేడుకలు చేసుకున్నారు. రంగులు జల్లుతూ స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కుల మతాలకు అతీతంగా హోలీ వేడుకలు నిర్వహించుకోవడం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ విజయకుమారికి మార్వాడి మహిళలు సన్మానం చేశారు.

టి.నరసాపురం : మండలంలోని పలు గ్రామాల్లో హోలీ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాపురంలో ప్రత్యేక పంచాయతీ పోరాట సమితి, కృష్ణాపురం యూత్ ఆధ్వర్యంలో హోలీ పండుగ నిర్వహించారు. అలాగే స్థానిక విజన్ యూపీ స్కూల్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో పెద్ద సంఖ్యలో బాలబాలికలు, స్థానిక యువత పాల్గొన్నారు.

కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి


కన్వీనర్లకు, గృహ సారథులకు అవగాహన కల్పిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట : సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తు రాష్ట్ర ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. దీనితో ఓర్వలేక పచ్చ మీడియా, తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారం లేవనెత్తారన్నారు. వీరికి బుద్ధి చెప్పే విధంగా సచివాలయ కన్వీనర్లు గృహ సారథులతో, వలంటీర్లతో, సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందే విధంగా అవగాహన కల్పిస్తూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, టౌన్ కన్వీనర్ సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ పండు ప్రసన్న, తడికలపూడి సచివాలయ కన్వీనర్ వెర్రి శ్రీను, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, తడికలపూడి సొసైటీ చైర్మన్ గుర్రాల రవి, మోరంపూడి సత్యనారాయణ, సాయిల స్వాతి, కరుటూరి బాలస్వామి, నాగళ్ళ సీతారామయ్య, బొట్ల లక్ష్మణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దెందులూరు పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

దెందులూరు: పెండింగ్ కేసులు లేకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పెదవేగి సీఐ ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి దెందులూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల్లో లోక్ అదాలత్, ట్రాఫిక్, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిశీలించారు. ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది విధితో మాట్లాడారు.

మానవత భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

పెదపాడు: మండలంలోని అప్పనవీడు మానవత శాఖ భవన నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త సిరి ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని నెర్సు శ్రీనివాస్ రూ.10లక్షల విరాళం అందించారని మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల మానవత భవనానికి శంకుస్థాపన చేసిన వెంటనే శ్రీనివాస్ తన తల్లితండ్రులు వెంకటేశ్వరరావు బేబీ శకుంతల జ్ఞాపకార్థం రూ.10 లక్షల విరాళం అందిస్తానని ప్రకటించారని అన్నారు. గతంలో శ్రీనివాస్ రూ.1.75 లక్షల విలువైన వాటర్ ట్యాంకరును అందించారని కోటేశ్వరరావు చెప్పారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

దెందులూరు: ఈ నెల 22న దేవతామూర్తుల గ్రామోత్సవం, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామదండు కమిటీ నాయకులు సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. దెందులూరులో అర్చకులతో మహానివేదన చేస్తున్న 9 ఆలయాల ఉత్సవ విగ్రహాలను 9 రథాలపై ఊరేగిస్తామన్నారు. ఉదయం 10.45 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. హిందూధర్మం పరిరక్షణకు తెలుగు సంస్కృతి సంప్రదాయాలను మరింత బలపరిచేందుకు 108 మంది ముత్తైదువులతో గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పిస్తామన్నారు. ప్రతి గుమ్మానికి మామిడి ఆకు తోరణాలు కట్టి దాదాపు 4 వేల హనుమాన్ జెండాలను పంపిణీ చేస్తామన్నారు. కమిటీ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తెలుగు క్యాలెండర్‌ను ముద్రించామన్నారు.

దోమలతో వ్యాధులు వ్యాప్తి

ఉంగుటూరు: దోమలతో వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వృద్ధిని నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. బుధవారం కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి కె. శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఏవీ సుబ్బలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి జన్మ నక్షత్రం ఉత్తరను పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భక్తులకు సేవలందించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ సంస్థ ప్రతినిధులకు సత్కారం

ఉంగుటూరు: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ బుధవారం జిల్లాలోని ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), దెందులూరు ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్యచౌదరిని వారు కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యేలు శాలువా కప్పి సత్కరించారు.